## క్లుప్తంగా

### పిచ్చిమొక్కల తొలగింపు



విద్యుత్ బుడ్డీల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**దుద్యాల్:** మండల పరిధిలో హస్నాబాద్ గ్రామంలోని రైతు వేదిక పక్కన ఉన్న విద్యుత్ సరఫరా చేసే బుడ్డీల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ నెల 24న అల్లుకున్న ప్రమాదం అనే శీర్షికతో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి స్పందించిన విద్యుత్ అధికారులు విద్యుత్ బుడ్డీల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో రైతు వేదిక సమీప కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

### ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలి

చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్



మైభయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ రాంచందర్

**కుల్కచర్ల:** ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైభయ్య తన ఇద్దరు కుమారులు విశాల్, వరుణ్ తేజలను ఒకటవ, రెండవ తరగతిలో అదే పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న రేష్మా తన కూతురు హుజ్మాను మరికల్ జెడ్పీ పాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా మైభయ్యను గురువారం చాకల్‌పల్లి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ విజయకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

**కుల్కచర్ల:** ఎయిడ్స్ నివారణకు అవగాహన అవసరమని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మాధురి పేర్కొన్నారు. గురువారం కులకచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైఆర్జి–కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా టెస్టులు నిర్వహించి వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు చెప్పారు. అవసరమైన వారు, అనుమానం ఉన్న వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఆర్జి–కేర్ మండల కో ఆర్డినేటర్ రాంచంద్రయ్య, ల్యాబ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

కడా ప్రత్యేక అధికారిని కోరిన గ్రామస్తులు



కడా ప్రత్యేక అధికారికి వినతి పత్రం అందిస్తున్న ఈర్లపల్లి గ్రామస్తులు

**దుద్యాల్:** మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిని కోరారు. గురువారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొగులయ్య, గ్రామస్తులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**బంట్వారం:** కోట్‌పల్లి బీజేపీ మండల అధ్యక్షుడు కె శివకుమార్ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకు భారం!



ఈర్లపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- కరువు కోరల్లో గ్రామాలు
- తీరని దినసరి వెతలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలు
- ఉపాధి హామీ పనులు తిరిగి ప్రారంభించాలని వేడుకోలు

**దుద్యాల్:** వర్షాలు కురువక..వ్యవసాయ పనులు ప్రారంభం కాకా కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారి జీవితాలు భారంగా తయారయ్యాయి. వర్షాలు సంవృద్ధిగా కురిస్తే పొలం పనులు జోరుగా సాగేవి. దీంతో దినసరి కూలీలకు పనులు లభ్యమయ్యేవి. దాదాపు 20 రోజులు గడుస్తున్నా సకాలంలో వర్షాలు పడకపోవడంతో గ్రామాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆయా పనులు చేసుకుని జీవనం సాగించే మహిళలు, పురుషులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు పడితే వ్యవసాయ పనులు ఉండేవని, తమకు చేతినిండా పని దొరికేదని చెబుతున్నారు. పనుల్లేక బతుకులు భారమయ్యాయని ఆవేదన చెందుతున్నారు.

> **కూలీకి వెళ్తా..**
>
> 
>
> నేను దినసరి కూలీ. నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తాను. వర్షాలు పడకపోవడంతో కూలీ దొరకడం లేదు. వర్షాలు కురిస్తే పత్తి, పెసర, కంది, మొక్క జొన్న వంటి పంట పొలాల్లో కలుపు, వరి నాట్లు దొరికేవి. వర్షాలు పడకపోవడంతో పొలాల్లో పనులు నిలిచిపోయాయి. ఇబ్బందులు తప్పడం లేదు.
>
> – బండారి వెంకటమ్మ, ఉపాధి కూలీ, హస్నాబాద్

వర్షాలు పూర్తిగా ముఖం చాటెయ్యడంతో వ్యవసాయ పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. పేదలకు కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. సకాలంలో వర్షాలు కురిస్తే మహిళలకు కలుపు, వరి నాట్లు, పురుషులకు గట్లు చెక్కడం వంటి పనులు లభ్యమయ్యేవని అభిప్రాయం వ్యక్త పరుస్తున్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాలు ఉపాధి దొరకకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పనులు తిరిగి ప్రారంభించాలని అధికారులను కోరుతున్నారు.

**కరువుఛాయలు**

వర్షాలు లేక గ్రామీణ ప్రాంతాల్లో కరువు ఛాయలు ఏర్పడుతున్నాయి. కూలీలకు ఉపాధి దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించి గ్రామీణ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని కూలీలు, ప్రజలు వేడుకుంటున్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు



దుద్యాల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

**కుల్కచర్ల:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, ఘణపూర్, తదితర గ్రామాల్లో రుణమాఫీ కాబడిన లబ్ధిదారుల వివరాలను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ అంటూ ఒకేసారి ఇవ్వకుండా విడతలుగా విడుదల చేయడంతో వడ్డీకే సరిపోయేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఘణపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రుణమాఫీ ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయితేజ, చంద్రభూపాల్, బాలకృష్ణయ్య, కృష్ణయ్య, అంబు, భాస్కర్, సర్దార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఈర్లపల్లిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం**

**దుద్యాల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని రైతులందరికి రైతు భరోసా అందజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మొగులయ్య, రైతులు రాహుల్, సాల్య నాయక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

### చన్గోముల్ ఎస్‌ఐగా భరత్‌రెడ్డి



**పూడూరు:** చన్గోముల్ ఎస్‌ఐగా భరత్‌రెడ్డి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి ఎస్‌ఐగా పని చేసిన భరత్‌రెడ్డిని చన్గోముల్ ఎస్‌ఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన భరత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

### ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

**నవాబుపేట:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని లింగంపల్లి, గంగ్యాడ, నారెగూడ, పలపల్లి, ముబారక్పూర్ గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, శేఖర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, గాలయ్య, శంకర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలి

ఎంఈఓ మనోహర్



మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

**షాద్‌నగర్:** బడీడు పిల్లలను తల్లిదండ్రులు విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్‌లోని ఎస్సీవాడ, అంబేడ్కర్ కాలనీల్లో విద్యాశాఖ అధికారులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా సర్కారు బడులకు పంపించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులను కల్పిస్తోందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్స్, దుస్తులు, పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగమణి, ఉపాధ్యాయులు జయశ్రీ, లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి
- లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు వేయించి, ప్రొసీడింగ్స్ అందజేసిన అధికారులు, నాయకులు



యాలాల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల సమక్షంలో ముగ్గు వేయిస్తున్న అధికారులు, నాయకులు

**యాలాల:** అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు యాలాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. లబ్ధిదారుల చేత నిర్మాణ పనులను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజిలయ్య, నాయకులు రాపోలు నాగయ్య, చందు, మారుతి, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

**కుల్కచర్లలో..**

**కుల్కచర్ల:** పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్హాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మల్కాపూర్, మరికల్ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసి ఇంటి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యకుమార్, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, నాయకులు శేఖర్, నర్సింలు, రాజేందర్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇళ్లను నాణ్యతతో నిర్మించాలి**

**దోమ:** ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్లకు ఎంపీడీఓ గ్యామా సూచించారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకొని ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీన, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అంతిరెడ్డి, గుడిసె రాములు, సాబేరబేగం, సంద యాదమ్మ, కాంగ్రెస్ నేతలు శేఖర్, బషీర్, ప్రభు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**పూడూరు:** ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మంజూరు చేసిన ఇండ్లనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ ముక్రం తెలిపారు. పూడూరు మండల పరిధిలో మొదటి విడతలో 242, రెండవ విడతలో 306 మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వం నాలుగు విడతల్లో అందజేస్తుందన్నారు.

**ప్రతి పేదోడికి ఇల్లు**

**పరిగి:** ప్రతి పేదోడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు.



దోమ: బొంపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ గ్యామా

## రఘువీరారెడ్డికి సముచిత స్థానం కల్పించాలి

- అనుచరుల డిమాండ్
- సమావేశాన్ని అడ్డుకొని నిరసన



సమావేశాన్ని అడ్డుకొని నిరసన తెలుపుతున్న రఘువీరారెడ్డి అనుచరులు

**ధారూరు:** పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ధారూరు మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో జిల్లా, మండల, గ్రామ కమిటీల నియామకం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ పరిశీలకులు నరేందర్, అశోక్ ముందే నిరసనకు దిగారు. సమావేశం ప్రారంభం కాగానే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్, నాయకులు మహ్మద్ జాకీర్, రఘుగౌడ్, రాము తదితరులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. రఘువీరారెడ్డికి ఏ పదవి లేనప్పుడు మాకెందుకు పదవులంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు పదవి ఇస్తేనే తాము కూడా పదవులు తీసుకుంటామని తేల్చి చెప్పారు. అప్పటి వరకు సమావేశం జరగనివ్వమన్నారు. దీంతో సమావేశంలో గందరగోళంగా మారింది. పార్టీ పరిశీలకులు, నాయకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. రఘువీరారెడ్డి రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం శ్రమించారని, ఆయన్ను విస్మరించడం సరికాదన్నారు. తాను ఇటీవల ఓ పని కోసం స్పీకర్ వద్దకు వెళ్తే అక్కడే ఉన్న ఓ నేత రూ.10 లక్షలు ఇస్తేనే మీ పని అవుతుందని చెప్పడం తనను బాధించిందని నాగసమందర్‌కు చెందిన నాయకుడు బుగ్గప్ప తెలిపారు. పార్టీలో సీనియర్లకు గుర్తింపు లేదని ఆరోపించారు. దీంతో సమావేశం నుంచి నాయకులు బయటికి వెళ్లిపోయారు. వారిని వెంబడిస్తూ వచ్చిన రఘువీరారెడ్డి అనుచరులు తాండూరు –హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. రఘువీరారెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, ధారూరు మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మర్పల్లి మాజీ ఎంపీపీ నర్సింహులు, మండల నాయకులు పాల్గొన్నారు.

### తాగునీటిపై శ్రద్ధ తీసుకోవాలి

మండల ప్రత్యేకాధికారి సదానందం

**మోమిన్‌పేట:** గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సదానందం పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో కార్యదర్శులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. నర్సరీలో పెరిగిన మొక్కలను వర్షాలు కురిసిన వెంటనే నాటాలన్నారు. మొక్కలను నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతీరోజు సేకరించే చెత్తను డంపింగ్ యార్డులో వేయాలని ఆయన తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి సేంద్రియ ఎరువుగా తయారు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, తహసీల్దార్ రవీందర్, ఏఓ జయశంకర్ పాల్గొన్నారు.

## పరిగి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



మాట్లాడుతున్న చంద్రయ్య

**బొంరాస్‌పేట:** అసైన్డ్ భూముల అమ్మకాలు, అక్రమ మట్టి వ్యాపారం వంటి చట్టవిరుద్ధ పనులతో ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిగి మండల తహసీల్దారు ఆనంద్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం కొడంగల్ పట్టణ కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పరిగి మండలం రంగంపల్లిలో ఎకరం ప్రభుత్వ (సీలింగ్)భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి, అక్రమార్కులకు కట్టబెట్టే ప్రయత్నం చేశారని తహసీల్దారుపై ఆరోపణలు చేశారు. దుద్యాల మండలంలోనూ రిజిస్ట్రేషన్లలో ఇలాంటి అక్రమ భూదందాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ప్రజాసంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్ బాబు, జగన్, సాయిలు, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

### అజయ్‌ప్రసాద్ జన్మదిన వేడుకలు

**బషీరాబాద్:** నావంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం బషీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వేడుకలకు తాండూరు ఎమ్మెల్యే సోదరులు బుయ్యని మనోహర్‌రెడ్డి, బుయ్యని సత్యనారాయణరెడ్డితో పాటు బషీరాబాద్, తాండూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు మాధవ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మాజీ ఎంపీపీ కరుణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

### ఛత్రపతి సాహుమహరాజు జయంతి

**పరిగి:** పట్టణ కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి సాహుమహారాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ భారత దేశంలో బ్రాహ్మణులు రాసిన మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి సాహు మహారాజ్ అని అన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా రిజర్వేషన్లను కల్పించింది ఆయనే అని గుర్తు చేశారు. అన్ని మతాలను, వర్గాలను కలుపుకుని అందరు సమానమే అందరికి సమాన హక్కు కల్పించాలని నినాదించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

**తాండూరు రూరల్:** ఉపాధిహామీ పథకానికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ నరోత్తం రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజావేదికలో డీఆర్‌డీఏ శ్రీనివాస్ పాల్గొంటారని పేర్కొన్నారు. కావున పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

### విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

**పరిగి:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాయిచంద్ స్ఫూర్తి ప్రతీ ఒక్కరిలో ఉందని, ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో సాయిచంద్ విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న అమరచింత్ గ్రామంలో విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యానికి పెద్దపీట

**తుర్కయంజాల్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉండడంతో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆయన గురువారం మునగనూర్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీ లైన్‌లు, పార్కులను పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.